క్లుప్తంగా

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



ధర్నా చేస్తున్న ఆటోడ్రైవర్లు

కర్నూలు(సెంట్రల్): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు నెలకు రూ.5 వేలు సాయం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వందలాది మంది డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్త్రీశక్తి పథకం ఆటో డ్రైవర్ల ఆర్థిక స్థితిగతులను తీవ్రంగా ప్రభావం చేస్తోందన్నారు. ఎవరూ ఆటోలు ఎక్కడం లేదని ఆవేదన చెందారు. వాహన మిత్ర పథకాన్ని షరతులు లేకుండా అమలు చేయాలని, జీఓలు 21, 31లను రద్దు చేయాలని కోరారు. కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్మరించుకొని వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు పట్టణ లైసెన్సుడు ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఇంజినీరింగ్ దినోత్సవం పురస్కరించుకొని ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సోమవారం ధర్నా చౌక్‌లో కర్నూలు జిల్లా భారతి సిమెంట్ డిస్ట్రిబ్యూటర్ మధు, మార్కెటింగ్ డైరెక్టర్ ఎద్దుల సూర్యారెడ్డి, వేగం పెయింట్స్ ఎండీ పినాకపాని సహకారంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో మోహన్ డయాబెటిక్ కేర్ సెంటర్ వైద్యులు ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. దాదాపు 400 మంది ప్రజలు పరీక్షలు చేయించుకున్నారు. అంతకముందు జేసీ డాక్టర్ బి.నవ్య ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. క్రెడాయ్ చైర్మన్ గోరంట్ల రమణ, వైస్ చైర్మన్ సాయిరాంరెడ్డి, కూడా పీఓ విజయ భాస్కర్ పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగు అంతంత మాత్రమే!

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నప్పటికీ పంటల సాగు అంతంత మాత్రంగానే ఉండిపోయింది. ముందస్తుగా వర్షాలు మొదలయినప్పటికీ కీలకమైన జూన్, జూలై నెలల్లో వర్షాలు అంతంత మాత్రానికే పరిమితం కావడంతో సాగు తగ్గినట్లు స్పష్టమవుతోంది. జూన్, జూలై నెలల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడటం వల్లనే ఖరీఫ్ పంటల సాగులో పురోగతి లేదనే విషయం స్పష్టమవుతోంది. ఖరీఫ్ సాధారణ పంటల సాగు విస్తీర్ణం 4,22,631 హెక్టార్లు ఉంది. అయితే ఇప్పటివరకు 3,56,196 హెక్టార్లలోనే పంటలు సాగయ్యాయి. గతేడాది ఇదే సమయానికి 4.08 లక్షల హెక్టార్లలో పంటలు సాగు కావడం విశేషం. 2024 ఖరీఫ్‌తో పోలిస్తే 2025లో సాగు భారీగా తగ్గడం ఆందోళన కలిగించే విషయం. గిట్టుబాటు ధరలు లేకపోవడం వల్ల వేరుశనగ, మిర్చి, పొగాకు సాగు తగ్గింది. అత్యధికంగా పత్తి 2,21,714 హెక్టార్లలో సాగయ్యింది. వేరుశనగ 28,660, ఉల్లి 11,703, మిర్చి 9,577, టమాట 1,811, కంది 40,289 ఆముదం 9,585, సజ్జ 5,756. మొక్కజొన్న 7,248, కొర్ర 2,723 హెక్టార్లలో సాగయ్యాయి.

సెక్యూరిటీ ఏజెన్సీ దక్కించుకునేందుకు ఘర్షణ

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సెక్యూరిటీ ఏజెన్సీ సబ్ లీజుకు తీసుకునేందుకు ఇద్దరు ప్రజాప్రతినిధులకు చెందిన వర్గాల మధ్య గొడవ తారాస్థాయికి చేరింది. సోమవారం ఆసుపత్రిలోని సెక్యూరిటీ ఏజెన్సీ కార్యాలయానికి ముఖ్య ప్రజాప్రతినిధి అనుచరులుగా చెప్పుకుంటున్న కొందరు వచ్చి అక్కడున్న వారితో గొడవ పడ్డారు. ప్రస్తుతం సెక్యూరిటీ టెండర్‌ను ఈగల్ హంటర్ సొల్యూషన్స్ అనే సంస్థ మూడు నెలల క్రితం దక్కించుకుంది. ఈ సంస్థ నుంచి సబ్ లీజుకు తీసుకునేందుకు కోడుమూరు నియోజకవర్గానికి చెందిన ఓ నాయకుడి వర్గం ప్రయత్నించి సఫలమైంది. ఆసుపత్రి మా నియోజకవర్గంలో ఉందని, వేరే నియోజకవర్గం వారు వచ్చి ఎలా పని చేస్తారంటూ మరో వర్గం నెల రోజులుగా ఘర్షణ పడుతోంది. గత నెలలో రాత్రివేళ కార్యాలయానికి వచ్చి ఫర్నీచర్‌ను విసిరిపడేసి బీభత్సం సృష్టించారు. తాజాగా ఇదే వర్గం మళ్లీ కార్యాలయానికి వచ్చి తమకు బాధ్యతలు అప్పజెప్పాలని గొడవ చేశారు. విషయం తెలిసిన మూడో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు వర్గాలను స్టేషన్‌కు పిలిచి మాట్లాడి పంపినట్లు సమాచారం.

డీఈఓ విద్యార్హతపై విచారణ చేయాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు డీఈఓ శామ్యూల్‌పాల్ విద్యార్హతలపై జ్యూడీషియల్ విచారణ చేపట్టాలని మంత్రి నారా లోకేష్‌ను డిమాండ్ చేస్తున్నట్లు ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ ఎర్రిస్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డీఈఓ విద్యార్హతలపై ఫిర్యాదులు వచ్చినా విద్యాశాఖ ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. జిల్లా కన్వీనర్ వీరేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి, లోకేష్, సందీప్, వాసు, నాయక్, మల్లికార్జున పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి

- పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం ఇచ్చిన ఏఐవైఎఫ్
- సమస్యలపై వినతులు సమర్పించిన ప్రజలు
- అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని జేసీ ఆదేశం



జేసీ డాక్టర్ బి.నవ్యకు వినతిపత్రం ఇస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు



పింఛన్ కోసం కలెక్టరేట్‌కు వచ్చిన దివ్యాంగుడు రామకృష్ణ

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రవ్యాప్తంగా 2.60 లక్షల మంది వలంటీర్లను తిరిగి నియమించాలని, పెండింగ్ వేతనాల చెల్లింపుపై అసెంబ్లీలో చర్చించాలని కోరుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్లకు రూ.10 వేల జీతం ఇస్తామని చెప్పి ఇవ్వకుండా పనిలోంచి తొలగించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేయకపోతే పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో భాగంగా జేసీ డాక్టర్ బి.నవ్య ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లాగిన్‌లో పరిష్కారం అయిన అర్జీలను ఎప్పటికప్పుడు ఆడిట్ చేయాలని ఆదేశించారు. సీఎంఓ గ్రీవెన్స్‌లకు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 9, కర్నూలు ఆర్డీఓ వద్ద 8, పత్తికొండ ఆర్డీఓ వద్ద 5, కలెక్టరేట్ ఏఓ వద్ద 3, సర్వే ఏడీ, విద్యాశాఖ, డీఆర్డీఏ పీడీ, ఏపీఐఐసీ జెడ్ఎంల దగ్గర ఒక్కో అర్జీ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని నిర్దేశించిన సమయంలోపు పరిష్కరించాలని ఆదేశించారు. డీఆర్వో వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

➤ వీకర్ సెక్షన్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో తాగుబోతుల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు రక్షణ గోడను నిర్మించాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్, కాలనీ మహిళ సుకన్య ఫిర్యాదు చేశారు.

➤ కల్లూరు సమీపంలోని ధనారెడ్డి పెట్రోల్ బంకు నుంచి బళ్లారి చౌరస్తా వరకు సర్వీసు రోడ్డు నిర్మించాలని, ప్రస్తుతం సర్వీసు రోడ్డు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తరచూ ప్రమాదాల జరుగుతున్నాయని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుధాకరప్ప, నాయకులు శ్రీనివాసులు, సత్యనారాయణ వినతిపత్రం ఇచ్చారు.

➤ పాతబస్తీలోని కవాడీ వీధిలో కీర్తి స్కూలు గోడ కూలి విద్యార్థి చనిపోవడం, మరో 8 మందికి తీవ్ర గాయాలైన నేపథ్యంలో ఆ పాఠశాలలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయి ఉదయ్, సీఐటీయూ నాయకులు రాజశేఖర్, అబ్దుల్‌దేశాయ్, షరీఫ్, అబుబకార్ వినతిపత్రం ఇచ్చారు.

➤ శిథిలావస్థ భవనాల్లో పాఠశాలను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, షాబీరర్‌బాషా డిమాండ్ చేస్తూ జేసీ డాక్టర్ బి.నవ్యకు వినతిపత్రం ఇచ్చారు.

➤ మంచినీటి కుళాయి కనెక్షన్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న కృష్ణగిరి మండలం ఎరుకల చెరువు గ్రామ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రావణిరెడ్డి ఫిర్యాదు చేశారు.

➤ మూడేళ్ల క్రితం షుగర్ వచ్చి కాలును తొలగించడంతో కుటుంబానికి దిక్కుగా ఉన్న తనకు ఏడాదిన్నరగా వికలాంగ పెన్షన్ కోసం తిరుగుతున్నా ఇవ్వడం లేదని కల్లూరుకు చెందిన రామకృష్ణ అనే దివ్యాంగుడు ఆవేదన వ్యక్తం చేశారు. పలు మార్లు కలెక్టర్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని చెప్పారు. పెన్షన్ కోసం కలెక్టర్‌కు మూడోసారి దరఖాస్తు ఇచ్చినట్లు చెప్పారు. తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, వారంతా, తాను, తన భార్య చేసే కూలి పనిపైనే ఆధారపడి జీవించాల్సి వస్తుందని, తనకు ప్రభుత్వం పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

➤ కౌతాళం మండలం కాత్రికి గ్రామానికి చెందిన గొప్పెర ఈరన్నకు ప్రమాదవశాత్తు కాలు విరగడంతో 70 శాతం వికలత్వం సర్టిఫికెట్ ఇచ్చారని, అయినా పింఛన్ మంజూరు చేయడం లేదని వినతిపత్రం ఇచ్చారు.

➤ ఎస్ఏపీ క్యాంపు, తిలక్ నగర్‌కు చెందిన డేరంగుల రమణ తనకు దివ్యాంగ పెన్షన్ ఇప్పించాలని విన్నవించారు.

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత

కర్నూలు(సెంట్రల్): మహిళల ఆరోగ్యాన్ని మెరుగు పరచి మరిన్ని వైద్య సేవలను అందించడం కోసమే స్వస్థ నారీ– స్వశక్తి పరివార్‌ను ప్రభుత్వం తీసుకొచ్చినట్లు జేసీ డాక్టర్ బి.నవ్య తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో స్వస్థ నారీ–స్వశక్త్ పరివార్ అభియాన్‌పై ముద్రించిన పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యం శక్తివంతమైన కుటుంబానికి కీలకమన్నారు. ఈ అభియాన్ ద్వారా మహిళల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగి పోషకాహారంపై శ్రద్ధ వహించి కుటుంబ స్థాయిలో ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంటుందన్నారు. కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎక్కడిక్కడ మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ప్రాథమిక వైద్యం అందిస్తారన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): సెప్టెంబర్‌ను పోషకాహార మాసంగా పాటిస్తూ పోషకాహారంతో కలిగే ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు వివరించాలని జేసీ డాక్టర్ బి.నవ్య సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పౌష్టికాహార మాసోత్సవాల పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు పోషన్ మా వేడుకలను జిల్లాలోని 1886 అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని ఆదేశించారు. ఐసీడీఎస్ పీడీ విజయ పాల్గొన్నారు.

కూటమి పాలనలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు సిటీ: పాతబస్తీ కవాడి వీధిలోని కీర్తి హైస్కూల్‌లో సోమవారం గోడ కూలి యూకేజీ విద్యార్థి మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, స్కూళ్లలో విద్యార్థులకు భద్రత కరువైందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్కూల్ యాజమాన్యంపై చర్యలు తప్పవు

గోడ కూలి విద్యార్థి మృతి ఘటన దురదృష్టకరమని, స్కూల్ యాజమాన్యంపై చర్యలు తప్పవని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించారు. గాయపడిన పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

ఐసీయూ పనులు వేగవంతం చేయండి



పనులపై ఆరా తీస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలోని క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన సోమవారం ఆసుపత్రిలోని డయాగ్నోస్టిక్ బ్లాక్ పైభాగంలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ పనులను పరిశీలించారు. కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు, ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లతో పనుల నాణ్యత, వేగం, సదుపాయాల అమలుపై ఆరా తీశారు. రోగులకు ఆధునిక వైద్యసేవలు అందించేందుకు సీసీయూలో వసతులను అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించాలని సూచించారు. సివిల్ వర్క్సతో పాటు ఎలక్ట్రికల్ వ్యవస్థలు, ఆక్సిజన్ లైన్స్, సెంట్రల్ మానిటరింగ్ సిస్టమ్ వంటి సదుపాయాలను ప్రమాణాలతో ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి దశలో పనుల పురోగతిని రికార్డు చేస్తూ నిర్ణీత సమయానికి పూర్తి చేసి యూనిట్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఇన్‌చార్జ్ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్లు డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

హ్యాండ్‌బాల్ విజేత వైఎస్సార్ జిల్లా

కర్నూలు (టౌన్): రాష్ట్రస్థాయి మినీ సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో వైఎస్సార్ జిల్లా బాలబాలికల జట్లు చాంపియన్‌గా నిలిచి డబుల్ క్రౌన్ సాధించాయి. స్థానిక దేవనగర్‌లోని గుడ్ షప్పర్డ్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న 17వ రాష్ట్ర స్థాయి మినీ సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. బాలుర విభాగంలో కడప, విశాఖపట్నం, కర్నూలు జట్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో కడప, విశాఖపట్నం, నంద్యాల జట్లు విజేతలుగా నిలిచాయి. విజేతలకు రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు కప్పు, మెడల్స్ ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, సువర్ణ, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

మరుగుదొడ్లను బాగు చేయాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని బండిమెట్టలో ఉన్న సామూహిక మరుగుదొడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు పార్వతయ్య, ఎస్ఎండీ షరీఫ్, గౌస్‌బాషా డిమాండ్ చేశారు. వారు సోమవారం మరుగుదొడ్లను పరిశీలించారు. 20 మరుగుదొడ్లలో 6 మాత్రమే వినియోగంలో ఉన్నాయని, మిగతా 14 దొడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. పాడైన దొడ్ల నుంచి దుర్వాసన వస్తోందని స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు.

డిమాండ్లను పరిష్కరించాలి

కర్నూలు(అగ్రికల్చర్): తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగులు నిరసన బాట పట్టారు. సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కర్నూలులోని విద్యుత్ భవన్‌లో ఉద్యోగులు ప్రభుత్వానికి, విద్యుత్ సంస్థల మేనేజ్‌మెంట్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మొత్తంగా 23 సంఘాలు నిరసనలో పాల్గొన్నాయి. జేఏసీ నేతలు సతీష్‌కుమార్, లక్ష్మీకాంతరెడ్డి, రామరాజు, రమణమూర్తి, సయ్యద్‌బాష పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించండి

కర్నూలు (టౌన్): రాజీవ్ నగర్, బాబా బృందావన్ నగర్ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు నిర్మించాలని స్థానికులు యం.మల్లికార్జున విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ పి.విశ్వనాథ్ పాల్గొని వివిధ కాలనీల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అదనపు కమిషనర్ ఆర్జీవీ క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఇవే..

- చంద్రమౌళి నగర్, పంచరత్న కాలనీల్లో తాగునీటి పైపులైన్ నిర్మించాలని స్థానికులు విన్నవించారు.
- జొహరాపురం నుంచి వెంకాయపల్లెకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారిందని స్థానికులు రవి ఫిర్యాదు చేశారు.
- 34వ వార్డు సీపీఐ కొట్టాలలో బోరు వేసి, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు రామక్రిష్ణ రెడ్డి కోరారు.



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న నగర వాసులు

- బళ్లారి చౌరస్తాలో రహదారులపై గుంతలను పూడ్చాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుల్లారెడ్డి ఫిర్యాదు చేశారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కర్నూలు (టౌన్): స్థానిక నగరపాలక కార్యాలయంలో కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులతో కలిసి 'అంగీకార్' పోస్టర్లను ఆవిష్కరించారు. కమిషనర్ మాట్లాడుతూ.. అంగీకార్ ద్వారా సమాజంలో బలహీన వర్గాల గృహ కలలను నేరవేర్చేందుకు దరఖాస్తుల ఫాస్ట్‌ట్రాక్ ధ్రువీకరణ, బ్యాంకుల ద్వారా గృహ రుణాలు కల్పించడం, వడ్డీ సబ్సిడీ వర్తించేలా కేంద్రం చర్యలు చేపట్టిందన్నారు.

రైలు కింద పడి ఆత్మహత్య

కర్నూలు: కర్నూలు రైల్వేస్టేషన్ శివారు తుంగభద్ర బ్రిడ్జిపై గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కర్నూలు నుంచి అలంపూరు రైలు మార్గంలో నేతాజీ కాంప్లెక్స్ రైల్వే బ్రిడ్జి వద్ద ట్రాక్‌పై మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయస్సు 45 ఏళ్లు ఉండొచ్చని కుడి చేతికి కాషాయ రంగు దారం ఉంది. వెండి కడియం ధరించాడు. కడియంపై చిన్నవేలు మల్లమ్మ, నాగిమునెమ్మ, పెద్దవేలు మల్లేశ్వరుడు, మల్లికార్జున, బండన్న, పి అనే తెలుగు అక్షరం ఉన్నాయి. నలుపు రంగు అంగీ, తెలుపు రంగు బనియన్ ధరించాడు. లోయర్ జోన్‌లో తాళాల గుత్తి ఉంది. అందులో బజాజ్ కంపెనీకి చెందిన ఆటో తాళంచెవులు మూడు, ఇంటికి సంబంధించిన రెండు తాళంచెవులు ఉన్నాయి. మృతుడి వివరాలు తెలిసినవారు 99088 89696 లేదా 99859 37035 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సీఐ శ్రీనాథ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆనవాళ్లను బట్టి మృతుడు ఆటోడ్రైవర్ అయి ఉండొచ్చని భావిస్తున్నారు.

యూరియా సరఫరా చేయాలి

కర్నూలు(సెంట్రల్): రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఏ.సూర్యప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించడంలో దారుణంగా విఫలమైందన్నారు. కనీసం ఎరువులు అడిగితే ఇవ్వలేని స్థితిలో ఉందన్నారు. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమే అధికారంలో ఉన్నా ఏం ఉపయోగమని ప్రశ్నించారు. మరోవైపు జిల్లాలో ఉల్లి రైతులు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు. ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తే రైతులు ఉల్లిని ఎందుకు పారబోస్తారని, పొలాల్లోనే ఎందుకు వదిలేస్తారన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని అధికారులను డిమాండ్ చేశారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జేసీ డాక్టర్ బి.నవ్యకు వినతి పత్రం ఇచ్చారు. ఆ పార్టీ నగర అధ్యక్షుడు షేక్ జిలానీ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కర్నూలు సిటీ: రాక్‌వుడ్ మెమోరియల్ హైస్కూల్‌లో 1976 నుంచి 1986 వరకు చదువుకున్న విద్యార్థులు సోమవారం ఆ స్కూల్‌లో తిరిగి కలుసుకున్నారు. నాలుగు దశాబ్దాల తరువాత కలుసుకోవడంతో వారి సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. ఒకరికి ఒకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ సంబరపడ్డారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, రెవరెండ్ ఆర్ఆర్‌డీ సజీవరాజు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. అందరి సహకారంతో రాక్‌వుడ్ స్కూల్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

రైలు ఢీకొని గేట్ కీపర్ మృతి

కర్నూలు: రైల్వే గేట్ కీపర్‌గా పనిచేస్తున్న షేక్షావలి (56) రైలు ప్రమాదంలో మృతిచెందాడు. ఈయన కర్నూలు నుంచి అలంపూరుకు వెళ్లే రైల్వే మార్గం తుంగభద్ర బ్రిడ్జి పర్యవేక్షకుడు (కాపలాదారుడు)గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం చెకింగ్ పూర్తి చేసుకుని బ్రిడ్జి మీదుగా స్టేషన్‌కు నడుచుకుంటూ వస్తుండగా హైదరాబాదు వైపు నుంచి కర్నూలుకు వస్తున్న వైన్‌గంగ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు సంతానం. స్టేషన్ మాస్టర్ నజియా ముబీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉల్లి రైతుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా?

కోడుమూరు రూరల్: గిట్టుబాటు ధర లేక అల్లాడిపోతున్న ఉల్లి రైతుల సమస్యలు కూటమి ప్రభుత్వానికి పట్టవా? అని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ ప్రశ్నించారు. సోమవారం మండలంలోని వర్కూరు గ్రామంలో సీపీఎం నాయకులు పర్యటించి రైతులు సాగు చేసిన ఉల్లి పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి ఉల్లి సాగు చేస్తే తీరా దిగుబడి చేతికొచ్చిన తర్వాత ధర భారీగా పతనం కావడంతో ఉల్లి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ఉల్లి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర.. రైతులు పెట్టిన పెట్టుబడిలో సగం కూడా రావడం లేదని, ఇలాగైతే రైతులు ఎలా వ్యవసాయం చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. క్వింటాల్ ఉల్లి రూ.2500 ప్రకారం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాక్రిష్ణ, స్థానిక నాయకులు రాజు, గఫూర్‌మియ్యా తదితరులు పాల్గొన్నారు.